క్లుప్తంగా

ఉత్తమ తహసీల్దార్‌గా హరిబాబు


హరిబాబుకు అవార్డు అందజేస్తున్న కలెక్టర్

మిర్యాలగూడ టౌన్ : అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి రిమార్కు లేకుండా విధులు నిర్వర్తించినందుకు ఉత్తమ తహసీల్దార్‌గా హరిబాబు అవార్డు అందుకున్నారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఓటరు దినోత్సవంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి తహసీల్దార్ హరిబాబుకు ఆ అవార్డును అందజేశారు. ఉత్తమ అవార్డు రావడంపై తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

కొండమల్లేపల్లి : 2025 జనవరి 1వ తేదీ నాటికి నూతనంగా పట్టాదారు పాసుపుస్తకం పొందిన రైతులు రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని కొండమల్లేపల్లి మండల వ్యవసాయ అధికారి జానకిరాములు కోరారు. శనివారం పలువురు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. నూతనంగా పట్టాదారు పాసుపుస్తకం పొందినరైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ పుస్తకాలతో రైతు వేదికలో ఏఈఓలకు దరఖాస్తు సమర్పించాలని సూచించారు.

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా ఎల్లయ్య

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా ఎదుల ఎల్లయ్యమాదిగా ఎన్నిక అవ్వడం పట్ల మండల ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఆయన్ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీను పంది సాయిలు, ఎదుల కిరణ్‌కుమార్, మోయిన్‌పాషా, కొర్ర యుగందర్ పాల్గొన్నారు.

గురుకులాల ఆర్‌సీఓను సస్పెండ్ చేయాలి

కొండమల్లేపల్లి : నిబంధనలకు విరుద్ధంగా తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న గురుకులాల ఆర్‌సీఓను సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్ డిమాండ్ చేశారు. కొండమల్లేపల్లి పాల శీతలీకరణ కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు రమావత్ లక్ష్మణ్‌నాయక్, వెంకటేష్, రవి, ఇద్దిరాములు, రాకేష్, చరణ్, పాల్గొన్నారు.

కోనాల శివయ్యకు పలువురి నివాళి

హాలియా : పట్టణానికి చెందిన జిల్లా టెలికం మాజీ మెంబర్ కోనాల శివయ్య శనివారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి జానారెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పట్టణంలోని బాధిత నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం శివయ్య మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో హాలియా మార్కెట్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి నారాయణ గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నాయకులు లింగారెడ్డి, అంజయ్య, అరుణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

6654 దరఖాస్తుల స్వీకరణ

మిర్యాలగూడ టౌన్ మిర్యాలగూడ మున్సిపాలిటీలో ఈనెల 21వ తేది నుంచి 24 వరకు నిర్వహించిన వార్డు సభల్లో 6,654 దరఖాస్తులు వచ్చాయని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ తెలిపారు. శనివారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లకు 1945, రేషన్‌కార్డులకు 4511, ప్రజాపాలన కింద 198 మంది దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వీటన్నింటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నట్లు తెలిపారు. అదే విధంగా ఇంకా ఏమైనా దరఖాస్తులు ఇవ్వాలనుకుంటే మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

చెక్కుల పంపిణీ

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని 13వ వార్డులో సీఎం సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు శనివారం స్థానిక కౌన్సిలర్ స్వర్ణలత, బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు విజేందర్‌రెడ్డి, గంగాధర్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీరాములు, శ్రీని వాస్, తిరుమలగిరి వజ్రం, షాహానాజ్‌బేగం ఉన్నారు.

కుమ్మరులను బీసీ ఏలో చేర్చాలి

పెద్దవూర : వెనుకబడిన కుమ్మరులను బీసీ-ఏలో చేర్చాలని శాలివాహన కుమ్మర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాధారపు భిక్షపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శాలివాహన కుమ్మరి సంఘం క్యాలెండర్‌ను తహసీల్దార్ సరోజ పావనితో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకన్న, దశరథ, ఆంజనేయులు, శ్యాంప్రసాద్, సురేష్, శ్రీకాంత్, వెంకటయ్య, చిరంజీవి, సైదయ్య, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ లేక ప్రయాణికుల పాట్లు

- రోడ్డుపై బస్సుల కోసం నిరీక్షణ
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- ప్రారంభం కాని సులభ్‌కాంప్లెక్స్ పనులు


గుర్రంపోడులో రోడ్డు మీద ఆగిన బస్సు


బస్సు కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

గుర్రంపోడు : మండలకేంద్రంలో బస్టాండ్ లేక ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బస్సులు నిలిపేందుకు నిర్ణీత స్థలం లేక డ్రైవర్లు తమ ఇష్టం వచ్చిన చోట్ల ఆపుతున్నారు. దీంతో ప్రయాణీకులు ఉరుకులు, పరుగులు పెట్టాల్సి వస్తుంది. కనీసం బస్ షెల్టర్ కూడా లేక ప్రయాణీకులు ఎండలోనూ, వానలోనూ తడుస్తూ, చలికి వణుకుతూ రోడ్డు పక్కనే నిలబడాల్సి వస్తుంది. ముఖ్యంగా వృద్ధులు, స్త్రీలు, చిన్న పిల్లలు బస్సు కోసం వేచి చూసే క్రమంలో నిలబడ లేక ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పక్కన దుకాణాల ముందు లగేజీతో నిలబడాల్సి రావడం, అడ్డుగా ఉన్నారంటూ వారు ఈసడించుకోవడం ఇబ్బందిగా మారిందని పేర్కొంటున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో అన్ని మండలకేంద్రాల్లో బస్‌స్టేషన్ల నిర్మాణాలు జరిగాయి. ఇక్కడ స్థలం కొరత కారణంగా బస్‌స్టేషన్ నిర్మాణానికి నోచుకోలేదు. కొన్నేళ్ల క్రితం ఆర్టీసీ తాత్కాలికంగా తడకలతో బస్‌షెల్టర్ వేసవిలో ఏర్పాటు చేసి ప్రయాణికులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకునేవారు. ఆ తర్వాత ఆర్టీసీ వారు కూడా పట్టించుకోలేదు. బస్టాండ్ నిర్మాణం ఉంటే తాగునీరు, మరుగుదొడ్లులాంటి సౌకర్యాలు ఉండేవి. మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చి బస్సుల ఎదురుచూస్తున్న ప్రయాణికులు మలమూత్ర విసర్జనకు ఎక్కడికి పోవాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది. మండలకేంద్రంలో కనీసం పెట్రోల్ బంకుల్లోనూ ప్రజలకు ఉపయోగపడేలా టాయ్‌లెట్లు లేవు.

ట్రాఫిక్‌కు అంతరాయం.. పొంచి ఉన్న ప్రమాదాలు

మండలకేంద్రం కూడలిలో నల్లగొండ- దేవరకొండ ప్రధాన రహదారిపై రోడ్డు పక్కనే ఆర్టీసీ బస్సులు ఆపుతుండటం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. బారికేడ్లు ఏర్పాటు చేసి రోడ్డు పక్కన తరచూ స్థలాన్ని పోలీసులు బస్సులు నిలిపేందుకు ఏర్పాటు చేస్తున్నా పోలీసు సిబ్బంది కొరతతో ఎప్పుడూ అమలు కావడం లేదు. ప్రధాన రహదారిపై రద్దీకి తోడు బస్సులు నిలుస్తుండటం, వచ్చిపోయే ప్రయాణికులతో మరింత రద్దీతో ప్రమాదాలు పొంచి ఉంటున్నాయి. గతంలో పోలీసు జీపు అదుపుతప్పడం, బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులను బ్రేకులు ఫెయిల్ కావడంతో ఆర్టీసీ బస్సు ఢీ కొన్న సంఘటనలో ప్రాణ నష్టం జరిగింది.

సులభ్‌కాంప్లెక్స్ నిర్మాణం జరిగేనా..

మూడేళ్ల క్రితం సులభ్ కాంప్లెక్స్ నిర్మాణానికి నిధులు మంజూరుకాగా అ వి సరిపోవని కంట్రాక్టర్లు ముందుకురాలేదు. మండలకేంద్రం సెంటర్‌లోని ఆర్‌అండ్‌బీ ఆవరణ స్థలం బస్టాండ్ నిర్మాణానికి అనువుగా ఉన్నప్పటికీ బంగ్లా ఆవరణ వెంట ఉన్న ఆక్రమణలు తొలగించడం సమస్యగా మారింది. అక్కడి వ్యాపారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వారికి కూడా మరింత సౌకర్య వంతంగా ఉండేలా ఆర్‌అండ్‌బీ లోపలి వైపునకు దుకాణాలను జరిపి వారి వ్యాపారాలకు ఇబ్బంది లేకుండా చూడాలని గతంలో ప్రజాప్రతినిధులు భావించారు. ఇందుకుగాను ఆర్‌అండ్‌బీ రహదారి గోడను తొలగించడం, స్థలం స్వాధీనానికి అనుమతి లభించడం లాంటి పక్రియ జరగాల్సి ఉంది. దుకాణదారుల వివరాలు సేకరించి వారికి అవసరమైతే బస్టాండ్ ఆవలివైపున మరింత సౌకర్యవతంగా ఉండేలా షాపింగ్ కాంప్లెక్స్‌కు అనువుగా ఉంటున్నందున వారికి నచ్చజెప్పి ఆర్‌అండ్‌బీ బంగ్లా ప్రహరీ వెంట దుకాణాలను లోపలికి జరిపించాలని ప్రజాప్రతినిధులు భావిస్తున్నా రాజకీయ కారణాలతో ముందుకు సాగడంలేదు.

బస్టాండ్ ఏర్పాటు చేయాలి

మండలకేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్‌తో పాటు సులభ్‌కాంపెక్స్ నిర్మాణం చేపట్టాలి. ఎన్నికలకు ముందు, ఎన్నికల తర్వాత కూడా మండలకేంద్రంలో సమస్యలను తీర్చుతామని హామీలు ఇస్తున్నా కార్యరూపంలో జాప్యం జరుగుతుంది.

\- రేపాక లక్ష్మీపతి, గుర్రంపోడు

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుదాం

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి. చిత్రంలో సబ్ కలెక్టర్, చైర్మన్, కమిషనర్

మిర్యాలగూడ టౌన్ : అదర్శ మున్సిపాలిటీగా మిర్యాలగూడను తీర్చిదిద్దుదామని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం మున్సిపల్ సాధారణ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా మున్సిపాలిటీలో డ్రైయినేజీలు, రోడ్లు, మంచినీటీ పైపులైన్ల కోసం సుమారు రూ.7కోట్ల వరకు చేపట్టనున్న 114 అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. అందుకు సంబంధించిన నిధులు మున్సిపల్ జనరల్ ఫండ్స్‌తో పాటు 15వ ఆర్థిక సంఘం నిధుల కింద పనులను చేపట్టనున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఐదేళ్లు పాటు మున్సిపాలిటీ అభివృద్ధికి కౌన్సిలర్లు అందరు ఎంతో కృషి చేశారని, కౌన్సిలర్ల పదవీ కాలం ముగిసినా కూడా మీకు ఉండే గౌరవం మీకుంటుందన్నారు. ఓటు అనేది వజ్రాయుధం లాంటిదని, జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరు ఓటు వేలును చేపించాలని ఎమ్మెల్యే కోరారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ మాట్లాడుతూ ఐదేళ్ల పాటు మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపించిన కౌన్సిల్ సభ్యులకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి ఫోన్ చేసి మున్సిపాలిటీలో ఐదేళ్ల పాటు అభివృద్ధి చేయడంతో పాటు కౌన్సిలర్లకు వీడ్కోలు సందేశాన్ని తెలియజేశారు.అనంతరం 48 మంది కౌన్సిలర్లను శాలువాలతో సత్కరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్, మున్సిపల్ డీఈ వెంకన్న, కౌన్సిలర్లు ఇలియాస్, ముదిరెడ్డి నర్సిరెడ్డి, బండి యాదగిరిరెడ్డి, దేశిడి శేఖర్‌రెడ్డి, రుణాల్‌రెడ్డి, జయలక్ష్మి, రవినాయక్, వంగాల నిరంజన్‌రెడ్డి, పత్తిపాటి సంజాతనవాబు, దుర్గ సత్యం, సుజాత, అనిత, తిరునగరు నాగలక్ష్మి, శ్రవంతి, కుర్ర చైతన్య, వెంకమ్మ, ఉదయ్‌భాస్కర్, రమేష్, జావీద్, ఆర్‌ఓ జ్ఞానేశ్వరీ, టీపీఓ సోమయ్య, టీపీఎస్ అంజయ్య, మెప్మా టీంసీ బక్కయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

చారిత్రక సంపదను కాపాడుకోవాలి


మాట్లాడుతున్న ఆర్డీఓ రమణారెడ్డి

దేవరకొండ : వారసత్వంగా వస్తున్న చారిత్రక సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి అన్నారు. శనివారం జాతీయ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ఖిలా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతమెంతో ఘనచరిత్ర కలిగిన దేవరకొండ గిరి దుర్గం చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలుస్తుందన్నారు. దేవరకొండ ఖిలాను సందర్శించేందుకు గాను ఇతర దేశాల నుంచి పర్యాటకులు సైతం వస్తుండడం గర్వించదగ్గ విషయమని తెలిపారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ మాట్లాడుతూ దేవరకొండ ఖిలా అభివృద్ధికి తనవంతు కృషి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సుదర్శన్, కౌన్సిలర్ పొన్నెబోయిన భూదేవిసైదులు, తహసీల్దార్ సంతోష్ కిరణ్, ధనుంజయ్య, వస్కుల సుధాకర్, గోపాలదాసు చెన్నయ్య, వస్కుల సత్యనారాయణ,యూనూస్ ఫర్హాన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'మలబార్'లో చైన్ మేళా

మిర్యాలగూడ : అంతర్జాతీయ ఆభరణాల వ్యాపార సంస్థ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్‌లో ఈనెల 25నుంచి ఫిబ్రవరి 3వరకు చైన్ మేళా నిర్వహిస్తున్నట్లు స్టోర్ హెడ్ సమీర్, మేనేజర్ సంపత్ తెలిపారు. శనివారం పట్టణంలోని సాగర్‌రోడ్డులోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్‌లో చైన్ మేళాను కస్టమర్లు ప్రవళిక, సునీత, జ్యోతి స్కూల్ ప్రిన్సిపాల్ మాధురిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా సమీర్, సంపత్‌లు మాట్లాడుతూ ప్రపంచ స్థాయి ఆభరణాల షాపింగ్ అనుభూతిని ఆస్వాదించేలా చైన్‌లను అందుబాటులో తీసుకొచ్చామని తెలిపారు. ఈ అవకాశాన్ని కస్టమర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో షోరూమ్ సిబ్బంది పాల్గొన్నారు.


చైన్ మేళాను ప్రారంభిస్తున్న కస్టమర్లు

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


టై, బెల్టులు, ఐడీ కార్డులను పంపిణీ చేస్తున్న ఎంఈఓ రాములు

పెద్దవూర : కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని మండల విద్యాధికారి తరి రాములు అన్నారు. శనివారం మండలంలోని ఊట్లపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన వాసుదేవుల రవీందర్‌రెడ్డి తన సొంత ఖర్చులతో అందించిన టై, బెల్టులు, ఐడీ కార్డులను పంపిణీ చేసి మాట్లాడారు. నిరుపేద విద్యార్థులు చదువుకుంటున్న ప్రభుత్వ పాఠశాలలకు దాతలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో అన్ని పాఠశాలల్లోనూ విద్యార్థులకు టై, బెల్టులు, ఐడీ కార్డులు, క్రీడా దుస్తులను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు వల్లపురెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బీరెడ్డి బాల్‌రెడ్డి, హెచ్‌ఎం బిక్షపతి, ఉపాధ్యాయులు ఉన్నారు.

సంక్షేమ పథకాల అమలుకు గ్రామాలు ఎంపిక

త్రిపురారం : ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను అమలు చేయడానికి నిడమనూరు మండలంలోని తుమ్మడం, త్రిపురారం మండలంలోని కంపాలపల్లి గ్రామాలను పైలెట్ గ్రామాలుగా అధికారులు ఎంపిక చేశారు. గణతంత్రం దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ నాయకులు అధికారులతో పైలెట్ ప్రాజెక్ట్ గ్రామాల్లో ప్రారంభించనున్నారు.

మాడుగులపల్లి మండలంలో దాచారం

వేములపల్లి (మాడుగులపల్లి) : ప్రభుత్వం నూతనంగా అమలు చేసే నాలుగు పథకాలు ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్‌కార్డుల పంపిణీకి మాడుగులపల్లి మండంలోని దాచారం గ్రామాన్ని ఎంపిక చేశారు. శనివారం రాత్రి మాడుగులపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆయన వెంట తహసీల్దార్ సురేష్, ఎంపీడీఓ తిరుమలస్వామి, ఎంపీఓ సంగీత, ఏపీఎం శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ సెక్రటరీ పాల్గొన్నారు.

మిర్యాలగూడ మండలంలో నాలుగు గ్రామాలు

మిర్యాలగూడ టౌన్ : రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద నియోజకవర్గంలో నాలుగు మండలాలను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. మిర్యాలగూడ మండలం రుద్రారం, అడవిదేవులపల్లి మండలం ముదిమాణిక్యం, దామరచర్ల మండలం రాజగట్టు, వేములపల్లి మండలం అన్నపురెడ్డిగూడెం గ్రామాలతో పాటు మాడుగులపల్లి మండలానికి సంబంధించిన పైలెట్ ప్రాజెక్టు నల్లగొండ నియోజకవర్గం నుంచి ఎంపిక చేశారు. పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైన ఈ గ్రామాల్లో నాలుగు సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందించనున్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం


ఆకాంక్ష స్కూల్‌లో ఉపాధ్యాయులతో విద్యార్థులు

హాలియా : పట్టణంలో ఆకాంక్ష పాఠశాల్లో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా, ప్రజాప్రతినిధులుగా, వివిధ శాఖల అధికారులుగా వ్యవహరించారు. అనంతరం విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ మోహన్‌రావు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమం లోడైరెక్టర్ ఉన్నం శ్రీనుబాబు, ప్రిన్స్‌పాల్ మోదాల రవీందర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లు సమయ పాలన పాటించాలి


రేషన్ డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

త్రిపురారం : గ్రామాల్లో రేషన్ డీలర్లు సమయ పాలన పాటించాలని నిడమనూరు తహసీల్దార్ వెంకటేశం అన్నారు. శనివారం నిడమనూరు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయలో రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.లబ్దిదారులకు రేషన్ బియ్యం పంపిణీ సక్రమంగా చేపట్టాలని నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. మరణించిన వారి పేర్ల జాబితాను సిద్ధం చేయాలని డీలర్లను ఆదేశించారు. రేషన్ కార్డులు ఉండి నూతన యునిట్ల కోసం మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని, నూతన రేషన్ కార్డులకు గ్రామాల్లో గ్రామ కార్యదర్శుల వద్ద దరఖాస్తులు అందివ్వాలన్నారు. కార్యక్రమంలో సందీప్, డీలర్ల సంఘం అధ్యక్షుడు నాగేశ్వర రావు పలువురు డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

పశువుల వివరాలను నమోదు చేయించుకోవాలి

పెద్దవూర : రైతులు తమ వద్ద గల ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు, కోళ్ల వివరాలను పశుగణన అధికారుల వద్ద నమోదు చేయించుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ నులక నాగార్జున్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని బట్టుగూడెం గ్రామంలో ఇంటింటికి తిరిగి రైతుల వద్ద ఉన్న గేదెలు, ఆవులు, మేకలు, గొర్రెలు, కోళ్ల వంటి వివరాలను అడిగి నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వెట ర్నరీ అసిస్టెంట్ అనిత, గోపాల మిత్ర గాలి లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తపస్ ధర్నాను విజయవంతం చేయాలి

పెద్దవూర : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఫిబ్రవరి 8న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద తపస్ ఆధ్వర్యంలో చేపట్టబోయే ధర్నాను విజయవంతం చేయాలని తపస్ మండల అధ్యక్షుడు అశోక్ అన్నారు. శనివారం పెద్దగూడెం జెడ్పీహెచ్ఎస్, మండల కేంద్రంలోని కేజీబీవీలో తపస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎం నారాయణరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నాయకులు ఉన్నారు.

విద్యుత్ సిబ్బందిపై పర్యవేక్షణ పెంచాలని వినతి

మిర్యాలగూడ : మిర్యాలగూడ డివిజన్ పరిధిలో విద్యుత్ సిబ్బంది పనిచేసే చోటే నివాసం ఉండేలా పర్యవేక్షణ పెంచాలని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం (భారతీయ మజ్దూర్ సంఘం) నాయకులు శనివారం నల్లగొండలో జిల్లా విద్యుత్ సూపరింటెండెంట్ ఇంజనీర్‌కు, మిర్యాలగూడలో విద్యుత్ డీఈకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి.శ్రీనివాస్ అధికారుల దృష్టికి పలు అంశాలను తీసుకొచ్చారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 24గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నప్పటికీ సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో పట్టణాల్లో, గ్రామీణ ప్రాంతాల్లో తరుచూ విద్యుత్ అంతరాయాలు జరుగుతున్నాయన్నారు. పంటలు పండించే సమయంలో విద్యుత్ సరఫరా అంతరాయాలతో తీవ్రంగా నష్టపోతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వారంలో ఒకరోజు వచ్చి హాజరు రిజిస్టర్‌లో సంతకాలు చేసుకుంటున్నారని, దీనిపై విచారణ జరిపించాలని కోరారు. ప్రతినెల స్థానికంగా నివాసం ఉండే ఇంటి యజమాని ఫోన్ నంబర్ విద్యుత్ బిల్లు వివరాలను సమరిపచాలని నిబంధనలు ఉన్నాయని వాటిని కచ్చితంగా అమలు చేయాలని కోరారు. ఆయన వెంట ప్రతినిధులు ఉన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

కొండమల్లేపల్లి : విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలని ఎంఈఓ నాగేశ్వర్‌రావు అన్నారు.గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా మండల కేంద్రంలోని శ్రీకృష్ణవేణి ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఎంఓఈ జ్యోతిప్రజ్వలన చేసి మాట్లాడారు. ఉత్తమ పౌరులుగా దేశానికి తమవంతు సేవ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ కట్ట వెంకట్‌రెడ్డి, ప్రిన్సిపాల్ దామోదర్‌రెడ్డి, పల్లా వెంకట్‌రెడ్డి, బొమ్మ శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

నడికూడ జెడ్పీహెచ్ఎస్‌కు డెస్క్ బెంచీలు బహూకరణ


డెస్క్ బెంచీలను బహూకరిస్తున్న దాత

గుర్రంపోడు : మండలంలోని నడికూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు డెస్క్ బెంచీలను తమ తండ్రి వాసా సుదర్శన్ జ్ఞాపకార్థం వారి కుమారులు రాంబాబు, శ్రవణ్‌లు శనివారం బహూకరించారు. లయన్స్ క్లబ్ నల్లగొండ గెలాక్సీ ఆధ్వర్యంలో పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో దాతలు బెంచీలను అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు మారెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ స్మారకార్థం పాఠశాలలకు దాతల సాయం పేద విద్యార్థులు చదివే ప్రభుత్వ పాఠశాలలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం క్షేత్రయ్య, టీచర్లు, గ్రామస్తులు కొండ నరేష్, సురేష్, గంగాధర్ పాల్గొన్నారు.

ఓటు దేశ భవిష్యత్‌ను నిర్ణయిస్తుంది


మిర్యాలగూడ : సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్


దేవరకొండ : ర్యాలీలో పాల్గొన్న ఏఎస్పీ, ఆర్డీఓ


హాలియా : ప్రతిజ్ఞ చేస్తున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ రఘు, ఎంఈఓ కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు

మిర్యాలగూడ : ప్రజాస్వామ్య దేశంలో ఓటు దేశ భవిష్యత్‌ను నిర్ణయిస్తుందని సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ అన్నారు. శనివారం జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హరిబాబు, డీఏఓ శర్మ తదితరులు ఉన్నారు.

ఓటు వజ్రాయుధంలాంటిది

దేవరకొండ : ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని దేవరకొండ ఏఎస్పీ మౌనిక, ఆర్డీఓ రమణారెడ్డి అన్నారు. శనివారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంతోష్‌కిరణ్,సీఐ నర్సింహులు, స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ, కమిషనర్ సుదర్శన్, ఎంపీడీఓ డానియల్, తదితరలు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

చింతపల్లి : మండల కేంద్రంలోని ఆలుకా జయేందర్ రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఓటు హక్కు పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రమాకాంత్ శర్మ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ధనరాజ్, వాసు రామ్, రామస్వామి, పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

హాలియా : ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని హక్కును సద్వినియోగం చేసుకోవాలని అనుముల మండల ఇన్‌చార్జ తహసీల్దార్ వై. రఘు అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా శనివారం హాలియా పట్టణంలో అధికారులు, విద్యార్థులు కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం బీఎల్ఓలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మండల ఎంఈఓ కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు, బీఎల్ఓలు, పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలోని శ్రీశ్లోక స్కూల్ విద్యార్థులకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆ స్కూల్ చైర్మన్ కుకుడాల ఆంజనేయులు మాట్లాడారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దవూర: జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారిపై జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులతో తహసీల్దార్ ఎస్. సరోజ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ తరి రాములు, ఆర్ఐలు దండ శ్రీనివాస్‌రెడ్డి, హబీబ్, రాజశేఖర్, పాల్గొన్నారు.

దేశ భవిష్యత్ ఓటర్ల చేతిలోనే

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : దేశ భవిష్యత్ ఓటర్ల చేతిలోనే ఉందని మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్ అనిల్ అన్నారు. 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం మండల కేంద్రంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఓటర్లను శాలువాలతో సన్మానించి, విద్యార్థులకు నోట్‌బుక్‌లను అందజేశారు. కార్యక్రమంలో డీటీ నాగమణి, మండల విద్యాధికారి కొనమంచిలి శ్రీనివాస్, ఆర్ఐ లక్ష్మీకాంత్, పాఠశాల ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : జాతీయ ఓటరు దినోత్సవాన్ని శనివారం కొండమల్లేపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు ప్రాముఖ్యతను తెలియజేస్తూ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఓటరు అవగాహన కరపత్రాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓలు ఎన్.యజ్ఞనారాయణ, ప్రవీణ్, పాల్గొన్నారు.

గుర్రంపోడు : జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా శనివారం మండలకేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద నిర్వహించిన అవగాహన ర్యాలీని నిర్వహించారు. అనంతరం మండల కూడలిలో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ తహసీల్దార్ మహ్మద్ ఫరీదుద్దీన్, ఆదర్శపాఠశాల ప్రిన్సిపాల్ జి. రాగిణి, హెచ్ఎం సంధ్యారాణి, ఆర్ఐ నజీర్, కిషన్, గిరి, పాల్గొన్నారు.

త్రిపురారం : ఓటు హక్కు కీలకమని త్రిపురారం తహసీల్దార్ ప్రమీలా అన్నారు. శనివారం జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో కలసి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి ప్రధాన సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ రవి నాయక్, ఎస్ఐ వై ప్రసాద్, ఆర్ఐ సైదులు , రవి కుమార్, పాల్గొన్నారు.